క్లుప్తంగా

నాణ్యమైన విత్తనంతోనే అధిక దిగుబడి



గౌతాపూర్‌లో వరి పంటలను పరిశీలిస్తున్న అధికారులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడి సాధ్యమని వ్యవసాయ శాస్త్రవేత్త లక్ష్మీప్రసన్న అన్నారు. శనివారం మండల వ్యసాయాధికారి రాజశేఖర్‌గౌడ్‌తో కలిసి చిలప్‌చెడ్, చండూర్, గౌతాపూర్ గ్రామాల్లో నాణ్యమైన విత్తనం, రైతన్నకు నేస్తం పథకం కింద వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పంపిణీ చేసిన ఎంటీయూ 1010 వరి సాగు పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వరి సాగు బాగుందన్నారు. కొంతకాలంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ కృష్ణవేణి, రైతులు భూపాల్, నర్సింలు, వెంకటేశం, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు



తనిఖీలు చేస్తున్న పోలీసులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): దేవీనవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని ఎస్‌ఐ నర్సింహులు అన్నారు. శనివారం ఆయన ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల పరిధిలోని చిట్కుల్ శివారులో ఉన్న చాముండేశ్వరి ఆలయ ప్రాంగణంలో డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్ సహకారంతో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనుమానాస్పదంగా ఎవరైన కనబడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఏదైనా సమస్య తలెత్తితే డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. గంజాయి, మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల విక్రయం, వినియోగంపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు.

సెంట్రల్ లైటింగ్ ప్రారంభం

రామాయంపేట(మెదక్): రామాయపేట పట్టణ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. ఈ మేరకు పట్టణంలో రూ. కోటి 20 లక్షలతో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సెంట్రల్ లైటింగ్ మంజూరు చేయించామన్నారు. టీపీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు అల్లాడి వెంకటేశ్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నీట మునిగిన పొలాలు



ఎనగండ్ల శివారులో నీట మునిగిన పొలాలు, ట్రాన్స్‌ఫార్మర్

కొల్చారం(నర్సాపూర్): సింగూర్ నుంచి దిగువకు నీటిని విడుదల చేయడంతో మండలంలోని మంజీరా పరివాహక ప్రాంతాల్లో వరద ఉధృతి పెరిగింది. దీంతో నదికి చుట్టుపక్కల ఉన్న పంట పొలాలు నీట మునిగాయి. అదే విధంగా మెదక్–నర్సాపూర్ జాతీయ రహదారి పోతంశెట్టిపల్లి వైపు ఏడుపాయల వనదుర్గా దేవికి వెళ్లే రహదారి, బ్రిడ్జిలను తాకుతూ నీరు ప్రవహిస్తుంది. దీంతో అటువైపు భక్తులు వెళ్లకుండా ముందస్తుగా పోలీసులు భారీకేడ్లను ఏర్పాటు చేసి బందోబస్తు నిర్వహిస్తున్నారు.

అలుగులు పారిన చెరువులు



కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో శనివారం భారీ వర్షం కురిసింది. దీంతో వివిధ గ్రామాల్లో చెరువులు, కుంటలు, వాగులు అలుగు పారుతున్నాయి. ఇందులో లింగంపల్లి–అందుగులపల్లి మధ్యలో గాడిదలవాగు, జాజితండా–రాజిపేట మధ్యలోని రాజిపేటవాగు లోలేవల్ బ్రిడ్జిపై నుంచి నీళ్లు పారుతున్నాయి.

రేగోడ్‌లో భారీ వర్షం

రేగోడ్(మెదక్): మండలంలో శనివారం కురిసిన భారీ వర్షానికి జగిర్యాల చెరువు పొంగి అలుగుపై వరద ఉధృతంగా పారింది. దీంతో రేగోడ్–జగిర్యాల రాకపోకలు నిలిచిపోయాయి.

నేత్రపర్వంగా నవరాత్రోత్సవాలు

లలితా త్రిపుర సుందరీ దేవిగా దుర్గమ్మ

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. శనివారం దుర్గామాత లలితా త్రిపుర సుందరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ మేరకు మండలంలోని బగలాముఖీ, చండీలోని చండీకాంబ ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు కనులపండువగా నిర్వహించారు.

మహిళల కుంకుమార్చన

రేగోడ్(మెదక్): మండలంలోని ఆయా గ్రామాల్లో దేవీ శరన్నవరాత్రులను భక్తులు ఘనంగా నిర్వహిస్తున్నారు. మండలంలోని దుర్గమ్మ కాలనీలో దుర్గామాత వద్ద మహిళలు కుంకుమార్చన చేసి దేవీకి పూజలు నిర్వహించారు. అలాగే జగిర్యాలలో లలితా త్రిపుర సుందరీగా అవతరించిన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

అన్నదానం

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాల వద్ద భక్తులు అన్నదానంతో పాటు ప్రత్యేక పూజలు చేపట్టారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

చేగుంట(తూప్రాన్): మండలంలోని వడియారంలో హనుమాన్ దేవాలయంలో జరుగుతున్న దేవి నవరాత్రుల పూజల్లో శనివారం ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డితో పాటు ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యలు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు రమేశ్ నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

కొర్విపల్లిలో..

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని కొర్విపల్లిలో వెలసిన దుర్ ఆలయంలో దేవిశరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ మేరకు శనివారం అమ్మవారు లలితా త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. అనంతరం భక్తులు కుంకుమార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి శివప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులు పుల్లారావు పాల్గొన్నారు.



వడియారంలో అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్లు



అల్లాదుర్గం: దుర్గామాతకు పూజలు చేస్తున్న భక్తులు



రేగోడ్: జగిర్యాలలో లలితా త్రిపుర సుందరీ దేవిగా అవతరించిన అమ్మవారు



చిన్నశంకరంపేట: కొర్విపల్లిలో లలితా త్రిపుర సుందరీదేవిగా దుర్గామాత



కౌడిపల్లి: వెంకటాపూర్(బి)లో దుర్గాదేవికి పూజలు చేస్తున్న మాధవానందస్వామి



కమలాపూర్‌లో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయంలో దుర్గాభవానీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపంలో శనివారం ఎమ్మెల్యే సునీతారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు రామాగౌడ్, మహిపాల్‌రెడ్డి, దుర్గారెడ్డి, కిషోర్‌గౌడ్, పోల నవీన్, కుతుబోద్దీన్, సందీప్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని వెంకటాపూర్(బి) దుర్గాదేవి మండపంలో రంగంపేట పీఠాధిపతి మాదవానందస్వామి ప్రత్యేక పూజలు చేశారు.



కౌడిపల్లి దుర్గాదేవిని దర్శించుకున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

ప్రారంభమైన స్థానిక ఎన్నికల సందడి

పంచాయతీ వార్డుల రిజర్వేషన్లు ఖరారు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలో 35 గ్రామ పంచాయతీలకు సంబంధించి శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ కలీముల్ల, ఏపీఓ పుణ్యదాస్, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకుల సమక్షంలో డ్రాపద్ధతిలో వార్డు రిజర్వేషన్లు తీశారు. ఇందులో బీసీలకు 42శాతం, ఎస్టీ, జనరల్ రిజర్వేషన్లు ఖరారు చేయగా.. 50శాతం మహిళలకు కేటాయించినట్లు ఎంపీడీఓ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు శ్రీనివాసరావ్, సారారామాగౌడ్, రాకేష్, దుర్గారెడ్డి, చిన్నంరెడ్డి, శాఖయ్య, పోలనవీన్, పాష, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

వార్డుల వారీగా..

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల వ్యాప్తంగా ఉన్న గ్రామపంచాయతీల వార్డుల వారీగా రిజర్వేషన్లు ఖరారు చేశామని ఎంపీడీఓ ప్రశాంత్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని ఆయా పార్టీల నాయకుల మధ్య వార్డుల వారీగా రిజర్వేషన్‌లు ఖరారు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీఓ తిరుపతి, కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.



చిలప్‌చెడ్‌లో వార్డుల రిజర్వేషన్లు ఖరారు చేస్తున్న అధికారులు

మహిళా రిజర్వేషన్లకు లాటరీ

చేగుంట(తూప్రాన్): గ్రామాల్లోని వార్డు సభ్యుల మహిళ రిజర్వేషన్‌లపై ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం వివిధ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నవీన్, బీజేపీ నాయకులు ఎల్లారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు నారాయణరెడ్డితో పాటు పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

వరదలపై అప్రమత్తత అవసరం : ఆర్డీఓ

సింగూర్ వరదలతో నిలిచిన రాకపోకలు



పేరూర్ శివారులో పోలీసుల పికెట్

హవేళీఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని పేరూర్ సమీపంలో ఉన్న ఎల్లాపూర్ బ్రిడ్జి వరద ఉధృతిని ఆర్డీఓ రమాదేవి శనివారం పరిశీలించారు. అయితే వరద ఉధృతి ఎక్కువగా ఉండడంతో పోలీసులు బొడ్మట్‌పల్లి వెళ్లే వాహనాలను కొల్చారం వైపు మళ్లించారు. అనంతరం వాహనాలు వెళ్లకుండా భారీకేడ్లు ఏర్పాటు చేసి ఎస్‌ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు.

రామ.. రామ ఉయ్యాలో..

ఘనంగా బతుకమ్మ సంబురాలు

మెదక్ కలెక్టరేట్: జిల్లా కేంద్రంలోని సఖీ కేంద్రంలో శనివారం బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రం నిర్వాహకురాలు రేణుక మాట్లాడుతూ స్త్రీ శిశు సంక్షేమ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు సంబురాలు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం అధికారులు, సిబ్బంది బతుకమ్మ పాటలు పాడుతూ సందడి చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారితా కేంద్ర సమన్వయకర్త సంతోషి, సిబ్బంది పాల్గొన్నారు.

విష్ణు ఫార్మసీ కళాశాలలో బతుకమ్మ సంబరాలు

నర్సాపూర్ రూరల్: మండల కేంద్రంలోని విష్ణు ఫార్మసీ కళాశాలలో అధ్యాపకులతో కలిసి విద్యార్థులు శనివారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. అలాగే పట్టణంలోని లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో మహిళలు బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు.

ఆటాపాటలతో సందడి

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో బతుకమ్మ వేడుకలను మహిళలు ఉత్సాహంగా నిర్వహించుకుంటున్నారు. శనివారం ఆలయాలతోపాటు ప్రధాన కూడల్లో ఆటాపాటలతో సందడి చేసి బతుకమ్మలను చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు.

జగ్గంపేటలో కాగితంతో పూలు, బుట్టలు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని జగ్గంపేటలో మహిళలు సద్దుల బతుకమ్మ సంబురాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రంగురంగుల పూలు, బుట్టలతో అల్లిన కాగితం బతుకమ్మలతో మహిళలు, చిన్నారులు బతుకమ్మ ఆడుతూ వేడుకలు చేసుకున్నారు. మహిళలు ఒకే చోట చేరి బతుకమ్మ ఆడటం చూపరులను కనువిందు చేసింది. అనంతరం బతుకమ్మలను స్థానిక చెరువుల్లో నిమజ్జనం చేశారు.

కొనసాగుతున్న బతుకమ్మ సంబరాలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వివిధ గ్రామాల్లో చిన్న బతుకమ్మల పండుగ సంబరాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా వర్షంలో సైతం మహిళలు, చిన్నారులు బతుకమ్మ ఆటాపాటలతో సందడి చేశారు. అనంతరం చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.



నర్సాపూర్ రూరల్: విష్ణు ఫార్మసీ కళాశాలలో బతుకమ్మలతో విద్యార్థులు



మెదక్ కలెక్టరేట్: సఖీ సెంటర్‌లో బతుకమ్మ వేడుకల్లో అధికారులు



లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో..



శివ్వంపేటలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



జగ్గంపేటలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



కౌడిపల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

యువతకు ఉద్యోగాలు కల్పిస్తాం

ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్

హవేళీఘణాపూర్(మెదక్): యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని శివారులో రూ.43 కోట్లతో ఏర్పాటు చేసిన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉద్యోగాల కోసమే ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్నామన్నారు. గత ప్రభుత్వం నిరుద్యోగులను పూర్తిగా విస్మరించిందన్నారు.ఏటీసీ కేంద్రానికి రూ.43 కోట్లు మంజూరు చేయడంపై సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. ఈ ఏటీసీ కేంద్రంలో 6 ట్రేడుల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తారని తెలిపారు. అనంతరం మండల పరిధిలోని రాజ్‌పేటకి చెందిన ఇద్దరు ఇటీవల వరదల్లో కొట్టుకుపోయారు. ఈ మేరకు బాధిత కుటుంబాలకు మంజూరైన రూ.5లక్షల చెక్కులను ఎమ్మెల్యే రోహిత్ అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సింధూరేణుక, మాజీ మున్సిపల్ చైర్మన్ తొడుపునూరి చంద్రపాల్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పరుశరామ్‌గౌడ్, నాగరాజు, టీజీఐఐసీ జోన్ మేనేజర్ శ్రీవాణి, కాంగ్రెస్ నాయకులు నాగరాజు, నాగిరెడ్డి, శ్రీకాంత్, ఏటీసీ ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.



ఏటీసీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రోహిత్

బాధితులకు అండగా ప్రభుత్వం

మెదక్‌జోన్: వరదలతో నష్టపోయిన బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. పంటల నష్టంతో పాటు ఆస్తి నష్టాలపై అధికారులు అంచనా వేశారన్నారు. అంతకు ముందు మెదక్ సీఎస్ఐ చర్చి ప్రాంగణంలో రూ.9.23 కోట్లతో వివిధ పనులకు శంకుస్థాపనలు చేశారు.

వరద బాధితులను ఆదుకోవడంలో విఫలం



డప్పులు అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

ఎమ్మెల్యే సునీతారెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): భారీ నష్టాలకు నష్టపోయిన బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆరోపించారు. ఈ మేరకు మండల పరిధిలోని గోమారంలో 40 మంది ఎస్సీలకు మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ చంద్రగౌడ్ సమకూర్చిన డప్పులను శనివారం ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి వరదలపై సమీక్ష నిర్వహించేందుకే పరిమితమయ్యారని ఎద్దేవా చేశారు. ఇప్పటివరకు నిధులు కేటాయించకపోవడం సిగ్గుచేటన్నారు. భారీ వర్షాలతో పంటలు దెబ్బతినడంతో పాటు ఇళ్లు కూలిపోయినా ఆర్థికసాయం అందలేదన్నారు. అలాగే జిల్లాలో రోడ్లు తెగిపోయినా కనీసం మరమ్మతులకు నిధులు కేటాయించలేదన్నారు. చెరువులు, కుంటల్లో నీరు సమృద్ధిగా ఉన్నా ప్రభుత్వం చేప పిల్లలు విడుదల చేయలేదని విమర్శలు చేశారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు అప్పులు చేసి సొంత నిధులు ఖర్చు చేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో అధిక స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల విజయం సాధిస్తామని ఎమ్మెల్యే అన్నారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చంద్రగౌడ్, హన్మంత్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, మైపాల్‌రెడ్డి, భిక్షపతిచారి, భిక్షపతిరెడ్డి, లక్ష్మణ్, వీరారెడ్డి, నర్సింహారెడ్డి, రామకృష్ణారెడ్డి, రాకేష్, నవీన్ పాల్గొన్నారు.

ఏకమయ్యారు.. తొలగించారు!



ప్రభుత్వ భూమిని కబ్జా చేసి హద్దు రాళ్లను వేస్తుండగా తొలగిస్తున్న గ్రామస్తులు



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న గడి పెద్దాపూర్ గ్రామస్తులు

- అక్రమ కబ్జాపై ఫిర్యాదు చేసినా స్పందన కరువు
- కబ్జా రాళ్లు తొలగించిన గ్రామస్తులు

అల్లాదుర్గం(మెదక్): ప్రభుత్వ భూమిని క్రీడామైదానానికి కేటాయించగా.. కొంత భూమిని రియల్ ఎస్టేట్ అక్రమంగా కబ్జా చేశారు. అయితే ఈ విషయంపై కలెక్టర్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదు. దీంతో కబ్జాదారులు రాళ్లు పాతేందుకు సిద్ధమయ్యారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఏకమై సంఘటన స్థలానికి చేరుకొని కబ్జా స్థలంలో వేసిన రాళ్లను తొలగించారు. మండల పరిధిలోని గడి పెద్దాపురంలో సర్వే నంబర్ 863లో ఉన్న ప్రభుత్వ భూమిని క్రీడామైదానానికి కేటాయించడంతో ఉపాధి హామీ కింద గ్రౌండ్ ఏర్పాటు చేశారు. ఈ సర్వే నంబర్‌లో 14ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా.. క్రీడా మైదానానికి కొంత భూమిని కేటాయించారు. అయితే ఇందులో మిగతా భూమిని కొంతమంది వ్యక్తులు ఆక్రమించుకుంటున్నారని గ్రామస్తులు గుర్తించారు. క్రీడా మైదానం పక్కనే పట్టా భూమిని కొనుగోలు చేసిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి అక్రమంగా భూమిని కబ్జా చేశారు. ఈ విషయంపై గడి పెద్దాపూర్‌కు జూలై 31న కలెక్టర్ ఇందిరమ్మ ఇళ్ల పరిశీలనకు వచ్చినప్పుడు స్థానిక యువకులు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ రెవెన్యూ అధికారులు కబ్జాదారుడిపై ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదు. దీంతో అధికారుల అండతో అక్రమ కబ్జా చేసిన ప్రభుత్వ భూమిలో రాళ్లు పాతేందుకు సంబంధిత రియల్ ఎస్టేట్ వ్యాపారి నిమగ్నమయ్యారు ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఏకమయ్యారు. శనివారం కబ్జాకు గురైన సంబంధిత క్రీడా మైదానానికి వెళ్లి కబ్జాదారుడు వేసిన రాళ్లను తొలగించారు. అనంతరం అల్లాదుర్గం రెవెన్యూ కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

లక్ష్మణ్ బాపూజీ త్యాగం మరువలేనిది



తూప్రాన్‌లో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకల్లో నాయకులు



పెద్దశంకరంపేటలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు

తూప్రాన్: స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమనేత కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను పట్టణ కేంద్రంలో శనివారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ త్యాగం మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మాజీ వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్, బొడ్డు నాగభూషణం, వెంకటనారాయణ, మచ్చయాదగిరి, కాంగ్రెస్ నాయకులు రవీందర్‌గుప్త, సిద్ధిరాం పాల్గొన్నారు.

బీసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో..

నర్సాపూర్ రూరల్: స్థానిక డివిజన్ బీసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శనివారం చిల్డ్రన్ పార్కులో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డివిజన్ బీసీ ఉద్యోగ సంఘంల అధ్యక్షుడు శేషాచారి మాట్లాడుతూ.. నిజాం పరిపాలన పరిపాలనకు వ్యతిరేకంగా పోరాటం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ ఉద్యోగ సంఘాల నాయకులు ప్రసన్న కుమార్ గౌడ్, శివకుమార్, నరేందర్ గౌడ్, వెంకటకష్ణ పాల్గొన్నారు.



నర్సాపూర్ రూరల్: కొండా లక్ష్మణ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉద్యోగులు

కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మార్కెండేయ మందిరంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు కనకరాజు, రాఘవులు, అనిల్, శ్రీనివాస్, సుధీర్, లింగమేష్, పడాల రవి, సుదర్శనం, నవీన్, అనంతస్వామి తదితరులున్నారు.